సాక్షి నిజామాబాద్

శనివారం, 18, నవంబర్, 2023



ఓటరు కార్డుకు 28 ఏళ్లు..
దేశంలో ఓటర్ కార్డు అమల్లోకి వచ్చి 28 ఏళ్లు పూర్తయ్యాయి. దొంగ ఓట్లను అరికట్టేందుకు ఈ కార్డును తీసుకొచ్చారు.
- 10లో ▸



మెనూ ప్రకారం భోజనం పెట్టాలి
పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.8 /17.4

వాతావరణం
ఆకాశం ఉదయం మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నందిపేట్(ఆర్మూర్): ప్రజలకు రోజుకో కొత్త కథ చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని, చెప్పినవి చెప్పినట్లు చేస్తున్న బీఆర్‌ఎస్‌కే ఓటేయాలని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్రంలో శుక్రవారం మున్నూర్ కాపు ఆత్మీయ సమ్మేళనంలో కవిత మాట్లాడారు. 50 ఏళ్లకు పైగా పాలించినప్పటికీ ఏమీ చేయలేని కాంగ్రెస్ మళ్లీ ఇప్పుడు అవకాశం ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. బీడీ కార్మికులకు లందరికీ పెన్షన్లు ఇస్తామన్నారు. పేదలకు ఆర్థికభారం తగ్గించేందుకే సిలిండర్‌ను రూ. 400కే సబ్సిడీ కింద ఇస్తామన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. హ్యాట్రిక్ విజయం సాధించి సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారన్నారు.

బ్యాలెట్ యూనిట్ల తరలింపు



సుభాష్‌నగర్ : శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత మధ్య శుక్రవారం నగరంలోని ఈవీఎం గోడౌన్ నుంచి అర్బన్ నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్లు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు ప్రక్రియ నిర్వహించారు. సప్లిమెంటరీ రాండమైజేషన్ జాబితా అనుసరిస్తూ బ్యాలెట్ యూనిట్లను అర్బన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మకరందుకు అప్పగించగా, పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. ఇప్పటికే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈవీఎంల తరలింపు పూర్తయ్యింది. అయితే అర్బన్ సెగ్మెంట్లో 21 మంది అభ్యర్థులు పోటీలో ఉండడంతో అదనపు బ్యాలెట్ యూనిట్ల ఏర్పాటు అనివార్యమైంది. అర్బన్ సెగ్మెంట్‌కు కేటాయించిన 361 బ్యాలెట్ యూనిట్ల తో పాటు ప్రస్తుతం సప్లిమెంటరీ ర్యాండమై జేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 361 బ్యాలెట్ యూనిట్లను కేటాయించారు.

క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపాలి



తెయూ(డిచ్‌పల్లి): తెయూ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో చక్కని ప్రతిభ కనబర్చి వర్సిటీకి, రాష్ట్రానికి పేరుతేవాలని రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. తెయూ క్యాంపస్ మైదానంలో వర్సిటీ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను రిజిస్ట్రార్ శుక్రవారం ప్రారంభించారు. ఎంపికైన జట్టు ఈనెల 22 నుంచి 26 వరకు తమిళనాడులో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ బాలకిషన్, ఫిజికల్ డైరెక్టర్లు బీఆర్‌నేత, బాలమణి, వర్షిణి, సంధ్య, అజ్మీర ప్రీతి, రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.





మంచిర్యాల నవీన్ కుమార్


బంగారు నమూనా వరల్డ్ కప్

ఆదివారం జరిగే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా కప్ గెలవాలని ఆకాంక్షిస్తూ.. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన స్వర్ణకారుడు మంచిర్యాల నవీన్‌కుమార్ 0.200 మిల్లీ గ్రాముల బంగారంతో వరల్డ్ కప్ నమూనాను తయారు చేశాడు. నవీన్ తయారు చేసిన వరల్డ్ కప్ చూపరులను ఆకట్టుకుంటోంది. - వేల్పూర్

వ్యూహాలకు పదును

- ప్రచారానికి మిగిలింది 11 రోజులే..
- కూడికలు, తీసివేతలతో విశ్లేషణలు
- కౌంట్‌డౌన్ నేపథ్యంలో హడావుడి

పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రత్యర్థుల ప్రచారం, వ్యూహాలు, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనించేందుకు సొంత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. మారుతున్న పరిణామాలకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకుంటూ ముందుకు కదులుతున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రచారానికి కేవలం 11 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రత్యర్థుల బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. ఎప్పటికప్పుడు తమ సన్నిహితులతో కలిసి ప్రచారం ముగిసిన తరువాత అర్ధరాత్రి సమయంలో తమకు నమ్మకమైన అనుచరులతో కలిసి ఎత్తుగడలపై ఆలోచనలు చేస్తున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల ముఖాముఖీ పోరు నెలకొని ఉండగా, మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ నెలకొని ఉంది. ముఖాముఖీ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రత్యర్థి ప్రచారం, వ్యూహాలు, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనించేందుకుగాను ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో భాగంగా ప్రధాన ప్రత్యర్థి పార్టీలో తమ కోవర్టులను సైతం ఏర్పాటు చేసుకుని వారిచ్చే సమాచారం ఆధారంగా ప్రణాళికలు రచిస్తున్నారు. మారుతున్న పరిణామాలకు అనుగుణంగా ఎత్తుగడలు మార్చుకుంటూ ముందుకు కదులుతున్నారు. ఎక్కడికక్కడ సొంత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ప్లాన్లు మార్చుకుంటున్నారు.

ఇదిలా ఉండగా బాన్సువాడ, జుక్కల్, నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థులకు, ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థికి చివరి రోజు టిక్కెట్లు కేటాయించడంతో వారికి మిగిలిన అభ్యర్థులతో పోలిస్తే తగినంత సమయం లభించలేదు. దీంతో పరిమిత సమయాన్ని సాధ్యమైనంతగా సద్వినియోగం చేసుకునే దిశగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇలా చివరి నిముషంలో టిక్కెట్లు దక్కించుకున్న వారిలో కొందరు అభ్యర్థులు తమ సొంత నియోజకవర్గాల నుంచి నియోజకవర్గాలకు వలస వెళ్లారు. అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకుని అక్కడి ప్రత్యర్థిని ఏవిధంగా ఢీకొట్టాలనే విషయమై ప్రత్యేకంగా వార్‌రూం ఏర్పాటు చేసుకుని మరీ ముందుకు కదులుతున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గరపడుతుండగా పార్టీ వేవ్‌తో పాటు అభ్యర్థి గెలుపోటముల లెక్కలు గంటగంటకూ మారుతున్నాయి. దీంతో అభ్యర్థులు మరింత హడావుడి పడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీచేస్తున్నప్పటికీ ఆ ప్రభావం లేకపోవడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో మరింత సీరియస్‌గా దృష్టి పెడుతున్నారు. ప్రస్తుత వేవ్ కొనసాగుతుందా లేదా అనే దిశగా కాంగ్రెస్ అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. జాతీయ నేతల పర్యటనలతో తమకు లబ్ధి కలుగుతుందనే భావనతో బీజేపీ అభ్యర్థులు ఉన్నారు. సమయం దగ్గర పడుతుండడంతో అన్ని పార్టీల అభ్యర్థులు వ్యూహాలకు మరింత పదును పెట్టుకుంటున్నారు.

■ త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో మా త్రం అభ్యర్థులు కూడికలు, తీసివేతలతో అందు కు తగిన విశ్లేషణలు చేసుకుంటూ వస్తున్నారు. తమకు ప్రత్యర్థులుగా ఉన్నవారిలో ఏ అభ్యర్థి, ఏ వర్గానికి చెందిన ఎన్ని ఓట్లను చీల్చుకుంటార నే విషయమై విశ్లేషణలు చేసుకుంటున్నారు. త్రిముఖ పోరులో ఏ అభ్యర్థి ఏ వర్గానికి చెందిన ఓట్లను చీల్చితే తమకు ప్రయోజనం కలుగుతుందో, లేనిపక్షంలో తమకు ఏమైనా నష్టం క లుగుతుందా అనే విషయమై లెక్కలు వేసుకుంటున్నారు. కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో మరింత హడావుడిగా పనులు చక్కబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

తెరపైకి గల్ఫ్ అంశం

- ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న వేళ..
- గల్ఫ్ బాధితులకు రూ. 5 లక్షలు ఇస్తామంటున్న కాంగ్రెస్
- వలస కార్మికులకు రూ. 5 లక్షల బీమా ఇస్తామని బీఆర్‌ఎస్ హామీ
- ఇంకా వెల్లడి కాని బీజేపీ వైఖరి
- బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు



మోర్తాడ్(బాల్కొండ): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచారం జోరందుకున్న వేళ కొత్త హామీలు తెరపైకి వస్తుండటంతో గల్ఫ్ వలస కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మేనిఫెస్టోను విడుదల చేయగా అందులో గల్ఫ్ ప్రవాసుల కోసం బోర్డు, గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ఇతర అంశాలపై హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ డిచ్‌పల్లిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతూ గల్ఫ్ వలస కార్మికులకు రూ. 5 లక్షల బీమా వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. వలస కార్మికుల అంశంపై బీజేపీ తన వైఖరిని వెల్లడించాల్సి ఉంది. ఇప్పటి వరకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో కొనసాగినా గల్ఫ్ వలస కార్మికుల విషయంలో ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. ఎన్నికలకు ముందు నుంచి గల్ఫ్ వలస కార్మికుల సంఘాలు కార్మికులు, వారి కుటుంబాల కోసం ఏదైనా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

మొదట్లో పార్టీ మెతక వైఖరి..

గల్ఫ్ అంశంపై మొదట్లో అన్ని పార్టీలు మెతక వైఖరిని అవలంబించాయనే విమర్శలు ఉన్నాయి. కేవలం దివంగత సీఎం వైఎస్సార్ తన హయాంలో గల్ఫ్ మృతులకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేశారు. అలాగే వాపస్ వచ్చిన వలస కార్మికులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలను ఇప్పించారు. వైఎస్ మరణానంతరం వలస కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకున్నవారు ఎవరూ లేరు. ఇప్పుడు గల్ఫ్ బోర్డును కాంగ్రెస్ పార్టీ తెరపైకి తీసుకురాగా, బీఆర్‌ఎస్ కార్మికులకు బీమా వర్తింప చేస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా రేషన్ కార్డుల నుంచి వలస కార్మికుల పేర్లు తొలగిస్తే బీమా ఎలా వర్తింప చేస్తారనేది సంశయంగా మారింది. ఏపీలోని వైఎస్ జగన్ ప్రభుత్వం వలస కార్మికులకు కేంద్రం అందిస్తున్న రూ. 10 లక్షల బీమాను వర్తింపజేస్తూ చర్యలు తీసుకుంది. ఏపీ నుంచి విదేశాలకు వలస వెళ్లిన కార్మికులకు బీమా వర్తింపచేయడానికి జగన్ ప్రభుత్వం నిబంధనలను సడలించి కార్మికులకు మేలు చేసింది.

తెలంగాణలో గల్ఫ్ బీమా లేదు..

ఇప్పటి వరకు తెలంగాణలో ఎలాంటి బీమా వర్తింప చేయకపోవడం గమనార్హం. గల్ఫ్ గళం వినిపించడానికి ఈ సాధారణ ఎన్నికల్లో ఆరుగురు జేఏసీ నాయకులు పోటీ చేస్తున్నారు. రెండు మూడు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చే సే విధంగా వలస కార్మికుల నాయకులు ప్రచా రం నిర్వహిస్తుండటం విశేషం. ఏదేమైనా ఎన్నికల తరుణంలో వలస కార్మికుల సంక్షేమం అంశం మరోసారి చర్చకు రావడం కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేడు రెండో విడత ఈవీఎం ర్యాండమైజేషన్
- 6,395 యంత్రాల కేటాయింపు

సుభాష్‌నగర్ : జిల్లాలో శాసనసభ ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. 30న పోలింగ్ ఉండటంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇదివరకే తుది ఓటరు జాబితా విడుదల చేయగా, ఇటీవల అనుబంధ ఓటరు జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఈవీఎంల ర్యాండమైజేషన్ శనివారం చేపట్టనున్నారు. మొదటి విడత ర్యాండమైజేషన్ గతనెల 20న చేపట్టారు. ఈవీఎంలను నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూంలలో భద్రపర్చారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలైన ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, అర్బన్, రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లో 1,549 పోలింగ్ కేంద్రాలు ఉండగా బ్యాలెట్ యూనిట్లు 2,295 (25శాతం అదనం), కంట్రోల్ యూనిట్లు 1,934 (25శాతం అదనం), వీవీ ప్యాట్లు 2,169 (40శాతం అదనం) కేటాయించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో..

శనివారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో యంత్రాల ర్యాండమైజేషన్ నిర్వహించనున్నారు. ప్రక్రియ మొత్తం కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తారు. నెంబర్ల ప్రకారం ఏ పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడుతుందో అధికారులు పార్టీల ప్రతినిధులకు వివరిస్తారు. ఇలా కేటాయించిన ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది ఓటింగ్‌కు ఒకరోజు ముందు (29న) పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తారు.

ఈవీఎంల కేటాయింపు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	బ్యాలెట్ యూనిట్లు	కంట్రోల్ యూనిట్లు	వీవీ ప్యాట్లు
ఆర్మూర్	217	271	271	303
బోధన్	246	307	307	344
బాన్సువాడ	258	322	322	361
నిజామాబాద్ అర్బన్	289	722	361	404
నిజామాబాద్ రూరల్	293	366	366	410
బాల్కొండ	246	307	307	344

పాస్‌లు ఉంటేనే అనుమతించాలి

- పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి
- ఏర్పాట్లను సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

సుభాష్‌నగర్ : పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎన్నికల కమిషన్ పాసులు కలిగి ఉన్న వారిని మినహాయించి, ఇతర వ్యక్తులను అనుమతించకూడదని రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ అజయ్ వి నాయక్, రాష్ట్ర పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిత్రా సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సమీక్షించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో పాటు జిల్లాలోని ఆయా నియోజక వర్గాల సాధారణ పరిశీలకులు గౌతమ్ సింగ్, సుబ్రా చక్రవర్తి, లలిత్ నారాయణ్ సింగ్ సందు, పోలీస్ అబ్జర్వర్ రుతురాజ్‌లతో భేటీ అయ్యారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ రాష్ట్ర పరిశీలకులకు వివరించారు. మొబైల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాలోకి అనుమతించవద్దని, ఓటర్లను ఏజెంట్లు ఒత్తిడి చేయకుండా నిఘా పెట్టాలన్నారు. ఎన్నికల బందోబస్తులో అత్యుత్సాహం వద్దని, నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. అర్బన్ నియోజకవర్గంలో 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని, ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర పరిశీలకులు ఆరా తీశారు. కాగా పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని రాష్ట్ర పరిశీలకులు సీపీ కల్మేశ్వర్‌కు సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, అదనపు డీసీపీ జయరాం, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సిరికొండ : మండల కేంద్రంతో పాటు న్యావనంది, పాకాల గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు గౌతమ్‌సింగ్ శుక్రవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ రోజు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆయన ఆదేశించారు. ఉప తహసీల్దార్ ప్రవీణ్, మునీరొద్దీన్ ఉన్నారు.

ధర్పల్లిలో..


ధర్పల్లి : త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దుబ్బాక, రేకులపల్లి, డీబీ తండాలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజక వర్గల జనరల్ అబ్జర్వర్ గౌతమ్ సింగ్ (ఐఏఎస్) శుక్రవారం పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా తాగునీరు, ర్యాంప్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ మాలతి, సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు.



జాబితాను పరిశీలిస్తున్న పరిశీలకులు గౌతమ్‌సింగ్

అభివృద్ధికి ల్యాండ్‌మార్క్ ఆర్మూర్

రాష్ట్రంలో అభివృద్ధికి ల్యాండ్ మార్క్‌గా ఆర్మూర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని, ఎన్నడూ లేనివిధంగా రూ. వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆర్మూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలే తమను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూ నిర్వహించగా పలు విషయాలు వెల్లడించారు.
– ఆర్మూర్



- నియోజకవర్గంలో రూ. 3 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం
- 17 గ్రామాల్లో బైపాస్ రోడ్లు
- రూ. 120 కోట్లతో ఉమ్మెడ శివారులో వంతెన
- రూ. 20 కోట్లతో సిద్దుల గుట్టకు ఘాట్‌రోడ్డు
- సంక్షేమం.. అభివృద్ధిని చూసే ఓట్లేస్తారు
- ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ పార్టీ ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

■ ఆర్మూర్ నియోజకవర్గంలో మీ హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటి?

✤ సమైక్య పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఆర్మూర్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితల సహకారంతో రూ. మూడు వేల కోట్లతో అన్ని గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశాం. ఆలూర్ బైపాస్, వెల్మల్ బైపాస్ రోడ్లతో కలిపి నియోజకవర్గంలో అన్ని దిక్కుల్లో 17 గ్రామాలకు బైపాస్ రోడ్లు వేశాం. నియోజకవర్గంలోని 87 గ్రామాలకు, పట్టణంలోని 36 వార్డులకు మిషన్ భగీరథ పథకం ద్వారా రూ. 450 కోట్లు వెచ్చించి తాగునీరు అందిస్తున్నాం. 30 ఏళ్లుగా డిమాండ్ ఉన్న ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌ను మేమే ఏర్పాటు చేశాం. ప్రతీ కుల సంఘానికి కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలు నిర్మించాం.

■ కొత్త మండలాలు, జీపీల పరిస్థితేంటి..?

✤ నియోజకవర్గంలో ఆలూర్, డొంకేశ్వర్ కేంద్రాలతో కొత్త మండలాలను ఏర్పాటు చేశాం. నియోజకవర్గంలోని 87 జీపీలో 16 జీపీల భవనాల నిర్మాణానికి రూ. 34 కోట్లు ఇచ్చాం. ఇదివరకే 40 జీపీల భవనాలకు రూ. 6 కోట్లిచ్చాం.

■ ఈ ఎన్నికల్లో మీరిస్తున్న హామీలు..?

✤ రాష్ట్రంలో ఆర్మూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడం కోసం పని చేస్తున్నాం. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతిఒక్క హామీని నెరవేరుస్తాం. హ్యాట్రిక్ విజయం అనంతరం ఆసరా పింఛన్లను పెంచుతాం. డబుల్ ఇళ్ల నిర్మాణాల్లో తలెత్తిన సమస్యలను గుర్తించాం. ప్లాట్ ఉన్న అర్హులకు ఇల్లు కట్టుకునేందుకు నిధులిస్తాం. బీడీ కార్మికులకు జీవనభృతినిస్తాం.

■ యువత కోసం ఏం చేశారు..?

✤ నియోజకవర్గంలో 5000 మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉచితంగా ఇప్పించాం. అందుకుగాను రూ. 4 కోట్లు ఖర్చు చేశాం. ట్రాఫిక్ నియంత్రణకు డివైడర్లు నిర్మించాం. జాబ్ మేళాలు నిర్వహించాం.

■ నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమ పథకాలెలా ఉన్నాయి..?

✤ ఆర్మూర్ నియోజకవర్గంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు 62 వేల మంది లబ్ధిదారులకు పింఛన్ల రూపంలో నెలకు రూ. 12 కోట్లకు పైగా చెల్లిస్తున్నాం. బీడీ కార్మికులకు జీవన భృతిని అందజేస్తున్నాం. 18,390 మందికి కల్యాణలక్ష్మి ద్వారా రూ. 180 కోట్లు, షాదీముబారక్ ద్వారా 4,200 మందికి రూ.42 కోట్లు ఇచ్చాం. యాదవులకు రూ. 32 కోట్లతో గొర్రెల పంపిణీ చేశాం. 39 వేల మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 72 కోట్లు చెల్లించాం.

■ రైతుల సంక్షేమం కోసం ఏ పథకాలు అమలు చేస్తున్నారు..?

✤ ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ రుణాలను మాఫీ చేశాం. వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ రూపంలో రూ. 168 కోట్లు, 50 వేల మందికి రైతు బందులో భాగంగా సుమారు రూ. 142 కోట్లు చెల్లించాం. రైతుబీమా పథకంలో భాగంగా 20వేల మందికి ప్రీమియం చెల్లింపునకు రూ. 95 కోట్లు నిధులు మంజూరు చేశాం.

■ నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలేవి?

✤ నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులోని పంచగుడి వద్ద గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.120 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశాం. సిద్దుల గుట్ట అభివృద్ధికి రూ.20 కోట్లతో ప నులు పూర్తిచేశాం. రూ. 8 కోట్ల 40 లక్షలతో శ్మశాన వాటికల అభివృద్ధి పనులు పూర్తి చేశాం. స్పెషల్ ఫండ్ రూ. 21 కోట్లు, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ ని ర్మాణానికి రూ. 21 కోట్లు, మైనార్టీలకు రూ. 5 కో ట్లు, క్రిస్టియన్లకు రూ. కోటి, మిషన్ కాకతీయలో భాగంగా 148 చెరువులకు రూ. 51 కోట్లతో మరమ్మతులు చేపట్టి 14,350 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేశాం. నిజాంసాగర్ కాలువల మరమ్మతులకు రూ. 38 కోట్లు, ఎత్తిపోతల పథకాలకు రూ. 15 కోట్లు, అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ. 105 కోట్లు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల నిర్వహణకు రూ. 148 కోట్లు, గుత్ప ఎత్తిపోతల పథకం విస్తరణకు రూ. 23 కోట్లు అందజేశాం. నందిపేట మండలంలోని లక్కంపల్లి సెజ్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం నుంచి రూ. 109 కోట్లు, 24 గంటల విద్యుత్ సరఫరా కోసం 13 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ. 15 కోట్లతో పనులు పూర్తిచేశాం. 12 వేల 500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ ఉన్న గోదాంల నిర్మాణానికి రూ.7 కోట్లు, స్కూల్స్, కాలేజీల నిర్మాణానికి రూ.117 కోట్లు అందజేశాం.

■ ఆర్మూర్ మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి?

✤ ఆర్మూర్ మున్సిపాలిటీలో పెర్కిట్-కోటార్మూర్, మామిడిపల్లి గ్రామాలను విలీనం చేసి అభివృద్ధికి ల్యాండ్ మార్క్‌గా మార్చాం. ఈ ఐదేళ్లలో ఆర్మూర్ పట్టణంలో రూ. వంద కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. పట్టణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేశాం.

■ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది..?

✤ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2014లో తెలంగాణ సెంటిమెంట్ ఆధారంగా ఎన్నికలు జరిగితే ప్రస్తుతం అభివృద్ధే కేంద్రంగా సాగుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే మమ్మల్ని గెలిపించనున్నాయి.

■ కొత్తగా మంజూరైన లిఫ్టులేమిటి..?

✤ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుర్బిర్యాల్, నికాల్‌పూర్, మచ్చర్ల-దేగాం, ఫత్తేపూర్, చిక్లి-కంఠం, చిట్టాపూర్ శివార్లలో ఆరు కొత్త ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి రూ.120 మంజూరు చేసింది.

క్లుప్తంగా

5 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పీజీ రెగ్యులర్‌ పరీక్ష ఫీజును డిసెంబర్‌ 5వ తేదీ వరకు చెల్లించవచ్చని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌ అరుణ శుక్రవారం తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ కోర్సుల్లో 3, 9వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలకు ఈ షెడ్యూల్‌ వర్తిస్తుందన్నారు. రూ. వంద అపరాధ రుసుముతో డిసెంబర్‌ 6వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. తెయూ పరిధిలోని అన్ని అనుబంధ పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ www.telanganauniversity.co.inను సంప్రదించాలని సూచించారు.

సామాజిక బాధ్యతపై అవగాహన అవసరం



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి పేర్కొన్నారు. తెయూ కంప్యూటర్‌ సైన్స్‌ కాలేజ్‌ సెమినార్‌ హాల్‌లో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులకు నిర్వహించిన ఒక రోజు అవగాహన సదస్సుకు రిజిస్ట్రార్‌ హాజరై మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లకు సామాజిక బాధ్యతపై ప్రోగ్రాం అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ ఆరతి, ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ రవీందర్‌ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్‌ మహేందర్‌, సంపత్‌, స్రవంతి, స్వప్న, అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులకు ఓట్లతో బుద్ధి చెప్పాలి

- బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వర్ని(చందూర్‌): ఎన్నికల్లో అవినీతిపరులకు ఓట్లతో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్‌ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చందూర్‌ మండలంలోని ఘన్‌పూర్‌, చందూర్‌, కారేగాం, మేడిపల్లి, లక్ష్మాపూర్‌ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారేగాంలో గిరిజనులతో కలిసి పోచారం నృత్యం చేశారు. నిజాంసాగర్‌ నాన్‌ కమాండ్‌ ఏరియా రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ. 150 కోట్లతో లిఫ్ట్‌ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సొంత నియోజకవర్గాల్లో ఓటమిపాలైన వారు పక్క నియోజకవర్గాల్లో ఎలా గెలుస్తారని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఎంతో చేశానని ఈసారి కూడా ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో చందూర్‌ ఎంపీపీ లావణ్యారాంరెడ్డి, మార్కెట్‌ కమిటీ అధ్యక్షురాలు కవిత, సర్పంచులు సాయిరెడ్డి, సత్యనారాయణ, గంగారాం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ మోస్రా మండలాధ్యక్షుడు

బీజేపీ మోస్రా మండల అధ్యక్షుడు కోనపురం స్వామిగౌడ్‌ బీఆర్‌ఎస్‌ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో శుక్రవారం చేరారు. చందూర్‌లో నిర్వహించిన ప్రచారంలో స్వామిగౌడ్‌కు పోచారం కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో నాయకులను ఎదగనివ్వకపోవడం, ఒంటెద్దు పోకడలు అధికమయ్యాయని, కొందరు నాయకుల ప్రవర్తన నచ్చక పార్టీ మారినట్లు స్వామి గౌడ్‌ తెలిపారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో–ఆర్డినేటర్‌ పిట్ల శ్రీరాములు, పార్టీ మండల కార్యదర్శి సాయాగౌడ్‌ పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు 28 ఏళ్లు..

- 1995లో తొలిసారిగా గుర్తింపు కార్డుల జారీ
- దొంగ ఓట్లను నివారించేందుకు నాటి కేంద్ర ఎన్నికల కమిషనర్‌ టీఎన్‌ శేషన్‌ వినూత్న ప్రయోగం



ఆర్మూర్‌: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించింది. ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు అనేక సంస్కరణలు తెచ్చింది. అందులో భాగంగా దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు గుర్తింపు కార్డులను అమలులోకి తెచ్చారు. ఓటరు గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 28 ఏళ్లు గడుస్తోంది. 1995లో నాటి కేంద్ర ఎన్నికల కమిషనర్‌ టీఎన్‌ శేషన్‌ ఓటరు నమోదు పారదర్శకంగా ఉండటంతో పాటు దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. అప్పట్లో ఈ నిర్ణయం సంచలనం కలిగించింది. ఓటరు జాబితాలో ఉన్న క్రమ సంఖ్య ప్రకారం ఓటరు ఫొటోను కార్డుపై ముద్రించి ఇస్తున్నారు. ఐడీ కార్డుపై పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటో, జనన తేదీ, కార్డు హోల్డర్‌ చిరునామా సైతం ముద్రిస్తారు. సీరియల్‌ నెంబర్‌, హోలో గ్రామ్‌ స్టిక్కర్‌, కార్డును జారీ చేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటాయి. దీనిపై ముద్రించిన సీరియల్‌ నెంబర్‌ చాలా ముఖ్యమైనవి అయినప్పటికీ ఇది ప్రతీ సంవత్సరం మారుతుంది. ఎన్నికల కమీషన్‌ ద్వారా ఓటర్‌ లిస్టు డాటాను ఆన్‌లైన్‌లో ఉంచినపుడు ఓటరు తమ ఎన్నికల సంఖ్య, సీరియల్‌ నెంబర్‌ను సులభంగా కనుక్కోవచ్చు. ఓటరు కార్డు ఉంటేనే ఓటు వేసే విధంగా నిబంధనలు విధించడంతో దొంగ ఓట్ల నివారణకు తోడ్పాటైంది. భారతీయ పౌరసత్వం కలిగి 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందడంతో పాటు ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకొనే అవకాశాలను పలు మార్లు కలిపించారు. అప్పట్లో బ్లాక్‌ అండ్‌ వైట్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను ఇప్పుడు డిజిటల్‌ విధానంలో ముద్రిస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఓటరు గుర్తింపు కార్డు అందుబాటులోకి వచ్చాక ప్రజలకు తమ ఓటు హక్కుపై పూర్తి అవగాహన వచ్చింది. ఓటరు జాబితాలో ఓటరు ఫొటో ముద్రిస్తుండటంతో మరింత పారదర్శకత పెరిగింది. ఓటరు గుర్తింపు కార్డు అన్నది ప్రతీ ఓటరుకు అందుబాటులోకి వచ్చింది. ఓటరు గుర్తింపు కార్డుతో పోలింగ్‌ కేంద్రానికి వచ్చిన ఓటరును పోలింగ్‌ ఏజంట్లు సులువుగా జాబితాలో ఉన్న పేరును సరిచూసుకొని ఓటు వేయడానికి ఎన్నికల అధికారులు అవకాశాన్ని కల్పిస్తున్నారు. అయితే ఓటరు గుర్తింపు కార్డులు అందుబాటులో లేని వారు పోల్‌ చిట్టీలో పొందుపరిచిన తమ ఓటు క్రమ సంఖ్య వివరాలతో కూడా ఓటు వేయడానికి అవకాశం కల్పించారు.

బీఆర్‌ఎస్‌, బీజేపీలు ఒక్కటే

- మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌ చవాన్‌



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న అశోక్‌ చవాన్‌

పెర్కిట్‌/ ఆర్మూర్‌టౌన్‌: బీఆర్‌ఎస్‌, బీజేపీలు ఒకే నాణెంపై ఉన్న రెండు బొమ్మలని అలాగే ఎంఐఎం పార్టీ సైతం వారికి తొత్తుగా వ్యవహరిస్తోందని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌ చవాన్‌ అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్‌ పట్టణంలోని పాత బస్టాండ్‌లో శుక్రవారం కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఎంఐఎం మైనార్టీ ఓట్లను చీల్చడానికి ముస్లిం జనాభా లేని చోట అభ్యర్థులను నిలబెడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు పరోక్షంగా మద్దతు తెలుపుతోందన్నారు. మద్యం, సర్కారు భూముల విక్రయంతో వచ్చిన ఆదాయంతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమన్నారు. అంతకుముందు ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లో నిర్వహించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం చవాన్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల పరిశీలకురాలు సాజీదా బేగం, నాయకులు కోల వెంకటేశ్‌, ముస్కు వెంకట్రాం రెడ్డి, ఏలేటి రవికాంత్‌రెడ్డి, జిమ్మి రవి, మీసాల రవి, జీవన్‌ రెడ్డి, మీర్‌ మాజీద్‌ అలీ, కొంతం మురళీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కృపాల్‌సింగ్‌

ఖలీల్‌వాడి: టీచర్ల బదిలీలో తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్‌ అన్నారు. బడారాంమందిర్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూనియన్‌ ముందుందన్నారు. ప్రస్తుత ఎన్నికలు జరిగిన వెంటనే బదిలీలో వెళ్లిన టీచర్లను రిలీవ్‌ చేసి ఎస్‌జీటీలకు, లాంగ్వేజ్‌ పండితులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్‌ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కనకపురం రవీందర్‌, నాయకులు ఉన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకుడు ముత్తారం నరసింహ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా కృపాల్‌ సింగ్‌ సోడి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనకపురం రవీందర్‌, జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవానంద్‌, జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా సుచిత్ర, జిల్లా కార్యదర్శిగా దినేశ్‌, సలహాదారులుగా వినోద్‌, గంగాధర్‌, ధనలక్ష్మి, సందీప్‌, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షులుగా నీరుగొండబుచ్చన్న, పొట్లూరి నాగేశ్వర్‌రావు, మహిళా రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షురాలిగా హజారి మనోజ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నల్లోల గంగాధర్‌, జయకృష్ణ, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సావిత్రి బాయి, రాష్ట్ర కార్యదర్శులుగా జావీద్‌, శ్రీకాంత్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జుక్కల్‌లో ముక్కోణపు పోరు

- ఎన్నికల్లో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఒకరు కొత్త అభ్యర్థి
- ప్రచారాల్లో నిమగ్నమైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- పోటీలో గెలిచేదెవరో..?



హన్మంత్‌సింధే



తోట లక్ష్మీకాంతరావు



అరుణతార

జంగ్‌ తెలంగాణ

నిజాంసాగర్‌: అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్‌ నియోజకవర్గంలో ముక్కోణపు పోరు నెలకొననుంది. నామినేషన్లు, ఉపసంహరణల అనంతరం జుక్కల్‌లో 17 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీల అభ్యర్థులు ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి హన్మంత్‌సింధే 2009, 20014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్‌ సాధించారు. బీజేపీ అభ్యర్థి అరుణతార 1999లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ సారి కాంగ్రెస్‌ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే సౌదాగర్‌ గంగారాంను పోటీ నుంచి తప్పించి ఎన్‌ఆర్‌ఐ అయిన తోట లక్ష్మీకాంతరావు టికెట్‌ ఇవ్వడంతో ఆయన తనదైన శైలిలో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

ప్రచారాల్లో దూసుకెళ్తున్న అభ్యర్థులు

ఎన్నికల ప్రచారాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులైన హన్మంత్‌సింధే, తోటలక్ష్మీకాంతరావు, అరుణతారా దూసుకెళ్తున్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి హన్మంత్‌సింధే జుక్కల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు సీఎం కేసీఆర్‌ హాజరై బీఆర్‌ఎస్‌ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు పార్టీ సీనియర్‌ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ప్రచారంలో నిమగ్నమయ్యారు. అన్ని మండలాలు, గ్రామాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. బీజేపీ అభ్యర్థి అరుణతార ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ అరుణతారకు మద్దతుగా ఎన్నికల ప్రచారం, రోడ్‌షో కార్యక్రమం నిర్వహించారు. బిచ్కుందలో బండి సంజయ్‌ రోడ్‌షోకు యువకులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇరు పార్టీల అభ్యర్థులతో పాటు పార్టీ నేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచార జోరు పెంచుతున్నారు.

రుణమాఫీపై చిగురిస్తున్న ఆశలు

- కాంగ్రెస్‌ మేనిఫెస్టోలో రూ.2లక్షల వరకు పంట రుణ హామీ
- రూ.లక్షలోపు రుణాలను మాఫీకి చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం

మోర్తాడ్‌: సాధారణ ఎన్నికల వేళ తాము అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు పంట రుణం మాఫీ చేస్తామని కాంగ్రెస్‌ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.లక్ష వరకు పంట రుణాల మాఫీకి చర్యలు తీసుకుంటోంది. ఇందులో కొంత మంది రైతులకు రుణ మాఫీ కాగా అనేక మందికి ఇంకా రుణమాఫీ ఫలాలు అందలేదు. జిల్లాలో 2 లక్షలకు మందికి పైగా రైతులకు పంట రుణాలు మాఫీ కావాల్సి ఉండగా ఎన్నికల కోడ్‌ కారణంగా బ్రేక్‌ పడింది. ఎన్నికల తంతు ముగిసిన తరువాత పంట రుణాలు మాఫీ అవుతాయో లేదో అనే విషయంలో స్పష్టత కరువైంది. ఒక వేళ కాంగ్రెస్‌ పార్టీ తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మొదటి సంతకం రూ.2లక్షల పంట రుణం మాఫీపై అని స్పష్టం చేయడంతో కొత్త ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు రుణ మాఫీ పొందిన రైతులు మళ్లీ రుణ మాఫీకి అర్హత సాధిస్తారని కాంగ్రెస్‌ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ మాత్రం ఇప్పటి వరకు రుణ మాఫీ పొందిన రైతులను కలిసి తమ పార్టీకి ఓట్లు వేయాలని ప్రచారం నిర్వహిస్తోంది. రుణ మాఫీ అంశంలో ప్రతిపక్ష పార్టీ ఒకలా, అధికార పార్టీ మరోలా ప్రచారం నిర్వహిస్తుండడంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారని చెప్పవచ్చు.

దొరల పాలనను అంతం చేయాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్‌



రామడుగులో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్‌

ధర్పల్లి: తెలంగాణలో కొనసాగుతున్న దొరల పాలనను అంతం చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ అన్నారు. మండలంలోని రామడుగు గ్రామంలో రూరల్‌ బీజేపీ అభ్యర్థి కులాచారి దినేశ్‌కు మద్దతుగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కేసీఆర్‌ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దోచుకున్న వాళ్లను ప్రజలు ఓటుతో జవాబు చెప్పి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. 75 ఏళ్ల కాంగ్రెస్‌ పాలనలో ఒక్క బీసీ ముఖ్యమంత్రి దొరకలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్‌ అరచేతిలో వైకుంఠంలాగా ఉందని, మరోసారి బీసీలకు అన్యాయం చేయడానికి రేవంత్‌ కుట్ర పన్నారని పేర్కొన్నారు. ప్రచారంలో నాయకులు గద్దె భూమన్న, రాజేశ్వర్‌, కర్క గంగారెడ్డి, రామస్వామి, గంగాదాస్‌ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి




వంట సామగ్రిని పరిశీలిస్తున్న డీఈవో

బాల్కొండ: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ అన్నారు. మెండోరా మండలంలోని బుస్సాపూర్‌ కేజీబీవీ, ముప్కాల్‌ మండలంలోని కొత్తపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డీఈవో వెంట ఎంఈవో రాజేశ్వర్‌, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సరికొత్తగా..

- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు
- పోలింగ్‌ శాతం పెంచడమే లక్ష్యం



మై ఓటర్‌ హెల్ప్‌లైన్‌ యాప్‌

బాన్సువాడ: ఎన్నికల్లో పోలింగ్‌ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. గతంతో పోలిస్తే ఈ సారి ఎన్నికలు మరిన్ని కొత్త పద్ధతులు, విధానాలను ఎన్నికల సంఘం ప్రవేశపెడుతోంది.

సీ విజిల్‌కు మరింత పదును

ఎన్నికల్లో నిర్వహించే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు 2014లో ఎన్నికల సంఘం సీ విజిల్‌ యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దీన్ని ఆధునీకీకరించడంతో పాటు ఎఫ్‌ఎస్‌టీతో అనుసంధానం చేసింది. అక్రమానికి సంబంధించిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్‌ చేస్తే వంద నిమిషాల వ్యవధిలో అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టి ఫిర్యాదుదారుకు సమాచారం ఇస్తారు. ఫిర్యాదు సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్‌ స్క్వాడ్‌కు చేరుతుంది.

ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు

తమ అభ్యర్థిని గుర్తించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈవీఎంలలో స్వల్ప మార్పులు చేసింది. గతంలో ఓటింగ్‌ యంత్రాలపై పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఫొటోలు కూడా పెట్టనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పోస్టల్‌ బ్యాలెట్‌ పైన ముద్రించేందుకు చర్యలు చేపట్టింది.

మై ఓటర్‌ హెల్ప్‌లైన్‌ యాప్‌

గతంలో ఓటర్లకు తమ ఓటు ఏ కేంద్రంలో ఉందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో ఓటింగ్‌ శాతం తక్కువగా నమోదవుతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో మై ఓటర్‌ హెల్ప్‌లైన్‌ యాప్‌ ప్రవేశపెట్టింది. ఈ యాప్‌ ఫోన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకుని ఓటరు కార్డు ఎపిక్‌ నంబర్‌ అందులో నమోదు చేస్తే ఏ పోలింగ్‌ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉందో తెలుస్తుంది.

ముందే పోస్టల్‌ ఓటింగ్‌

ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ఈ దఫా పోలింగ్‌ ప్రక్రియ ప్రారంభించడానికి ముందుగానే పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. గతంలో పోస్టల్‌ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే సమయంలో వేసేందుకు అవకాశం ఉండేది.

యూత్‌ పోలింగ్‌ కేంద్రాలు

మహిళలు, దివ్యాంగుల ఓటు శాతం పెంపొందించే ఉద్దేశంతో గతంలో వీరికి ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యూత్‌ పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిని యువ అధికారులే నిర్వహించనున్నారు. మొదటి సారి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

అకౌంటింగ్‌ బృందాల ఏర్పాటు

ఎన్నికల సమయంలో వ్యయ నియంత్రణ అనేది లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ఖర్చులను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో మొదటిసారి నియోజకవర్గానికో అకౌంటింగ్‌ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలనకు 15 రోజులకొకసారి వివరాలు అందించాల్సి ఉండేది. ప్రస్తుతం ప్రచారంతో పాటు ఇతరత్రా కార్యక్రమాలు చేస్తున్న వ్యయాన్ని పరోక్షంగా అకౌంటింగ్‌ బృందాలు పరిశీలించనున్నాయి.

క్రైం కార్నర్‌

మెక్సికోలో రెంజల్‌ యువకుడి గల్లంతు

రెంజల్‌: మెక్సికోలో మండల కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అనే యువకుడు గల్లంతయ్యాడు. బాధిత కుటుంబీకులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బతుకుదెరువు నిమిత్తం మెక్సికోలోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో పదినెలల నుంచి పనిచేస్తున్నాడు. ఓడలోని హోటల్‌మెనేజ్‌మెంట్‌ విభాగంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సముద్రంలో పడి గల్లంతైనట్లు చెప్పారు. యువకుడు పనిచేస్తున్న కంపెనీ వారు పూర్తి సమాచారం అందించడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సాయంత్రం పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం

మాక్లూర్‌: మండలంలోని ముల్లంగి(బి) గ్రామానికి చెందిన బూరోల్ల రాజు అదృశ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. రాజు ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



నిజాంసాగర్‌: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఒకరి నుంచి రూ. లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్‌ శుక్రవారం తెలిపారు. నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఉన్నతాధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఇంతియాజ్‌ (ఫైల్‌)

తాడ్వాయి: మండలంలోని క్రిష్ణాజివాడిలో దూదేకుల ఇంతియాజ్‌ (25)అనే యువకుడు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామ శివారులోని తన ఫౌల్ట్రీఫాం వద్దకు వెళ్లిన ఇంతియాస్‌ అక్కడనేఉన్న సింగిల్‌ఫేజ్‌ స్థంబానికి కరెంట్‌ వైర్‌ పెడుతుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అఫ్రిస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో..

ఇందల్వాయి: మండలంలోని దేవీతండాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బోధన్‌ మండలం పెంటకుర్దు గ్రామానికి చెందిన మహబూబ్‌ (56) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. మృతదేహాన్ని మండల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని తీసుకెళ్తున్న మున్సిపల్‌ సిబ్బంది

ఆర్మూర్‌: ఆర్మూర్‌ పట్టణంలోని బస్టాండ్‌ ఎదురుగా ఉన్న సైదాబాద్‌ కాలనీలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం ఉదయం గుర్తించారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మున్సిపల్‌ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించగా అది తమ పని కాదని పోలీసులు పంచనామా చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో స్థానికులు డయల్‌ 100కు ఫోన్‌ చేయగా మధ్యాహ్నం 12.30 గంటలకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మున్సిపల్‌ సిబ్బందితో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్‌

ఆర్మూర్‌టౌన్‌: ఆలూర్‌ మండలంలోని దేగాం రోడ్డులో ఎక్సైజ్‌ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో మద్యం తరలిస్తున్న సిద్దాపూర్‌ గ్రామానికి చెందిన విఠల్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్సన్‌ తెలిపారు. మద్యాన్ని, ఆటోను సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సైలు గంగాధర్‌, ప్రమోద్‌, చైతన్య, చంద్రమౌళి, సిబ్బంది వికాస్‌గౌడ్‌, సందీప్‌, దేవీదాస్‌, నరేశ్‌ పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



రుద్రూర్‌: కోటగిరిలోని మైనారిటీ రెసిడెన్షియల్‌ బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్‌ సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని మందులు అందజేశారు. వంటశాలలను పరిశీలించారు. ప్రిన్సిపాల్స్‌ ఎండీ బషీరుద్దీన్‌, సవిత రాణి, ఏఎన్‌ఎం ప్రియదర్శిని, వైద్య సిబ్బంది జ్యోతి, శ్రీదేవి ఉన్నారు.